విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189




# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 142 | volume: 1, Issue:142 | శనివారం 20 డిసెంబర్ 2025 పేజీలు : 8 వెల : 3.00


## నిజాంపేటలో 13 ఎకరాల ప్రభుత్వ భూమి రక్షణ:
# హైడ్రా కీలక చర్యలు



- రూ.1300 కోట్ల విలువైన భూమి కాపాడిన హైడ్రా...
- అక్రమ షెడ్డుల తొలగింపు, ఫెన్సింగ్ ఏర్పాటు...
- రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన...

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, డిసెంబర్ 19:** బాచుపల్లి మండలం నిజాంపేట గ్రామ పరిధిలోని 13 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు శుక్రవారం కాపాడారు. ఈ భూమి విలువ దాదాపు రూ.1300 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వే నంబర్లు 186, 191, 334లలో ప్రభుత్వ భూమి అక్రమ కబ్జాకు గురవుతోందని బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా స్పందించింది. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో సర్వే నంబర్ 334లో ఇప్పటికే నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమంగా కబ్జా కావడంతో పాటు అక్కడ శాశ్వత నివాసాలు కూడా ఏర్పడినట్లు నిర్ధారించారు. నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నారు. మిగిలిన 13 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఏర్పాటైన తాత్కాలిక షెడ్డులను హైడ్రా అధికారులు తొలగించారు. అనంతరం భూమి మొత్తం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. దీని ద్వారా భవిష్యత్తులో మరిన్ని అక్రమ కబ్జాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని అధికారులు స్పష్టం చేశారు. అక్రమ కబ్జాలపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు కొనసాగిస్తామని హైడ్రా వెల్లడించింది.

## మహిళా న్యాయవాదిపై పోలీస్ స్టేషన్‌లో దారుణం



- క్లయింట్ కేసులో జోక్యం...
- హింస, లైంగిక వేధింపుల ఆరోపణలు...
- సీసీటీవీ ఫుటేజ్ కోరిన సుప్రీంకోర్టు...

లక్నో, డిసెంబర్ 19: ఒక క్లయింట్‌కు న్యాయ సహాయం అందించేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళా న్యాయవాదిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి, శారీరకంగా హింసించి, లైంగికంగా వేధించారన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా సెక్టార్ 126 పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకున్నట్లు బాధిత న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపింది. తీవ్రంగా గాయపడిన తన క్లయింట్ వినయ్ సింఘాల్ ఫిర్యాదుపై తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పట్టుబట్టినందుకే తనను అక్రమంగా నిర్బంధించారని ఆమె ఆరోపించింది. నిడిసెంబర్ 3న అర్ధరాత్రి తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తనను స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు అక్కడి సిబ్బంది అర్ధరాత్రి 12.30 గంటల నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్బంధించి చిత్రహింసలు పెట్టినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ సమయంలో తనను లైంగికంగా వేధించారని, నల్లకోటును చించి, రహస్య వీడియో రికార్డర్ ఉందన్న అనుమానంతో దుస్తులు తనిఖీ చేశారని తెలిపారు. ఈ తనిఖీల్లో తన శరీరాన్ని తాకుతూ అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. నిఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. నోయిడా సెక్టార్ 126 పోలీస్ స్టేషన్‌లో ఘటన జరిగిన సమయానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను జనవరి 7లోపు సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశించింది. అంతవరకు ఆ ఫుటేజ్ తొలగించకుండా సంరక్షించాలని నోయిడా పోలీస్ కమిషనర్‌కు స్పష్టమైన సూచనలు జారీ చేసింది. ఈ కేసులో న్యాయవ్యవస్థ జోక్యం కీలకమవుతుందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి.

## అస్సాం రైఫిల్స్ యుద్ధ స్మారకంలో వీర జవాన్లకు నివాళులు

- మోన్ జిల్లాలో ప్రాణత్యాగం చేసిన వీరులకు స్మరణ...
- శ్రద్ధాంజలి అర్పించిన సైనికాధికారులు...
- దేశ రక్షణలో వారి త్యాగం చిరస్మరణీయం...



కొహిమా, డిసెంబర్ 19: నాగాలాండ్ రాష్ట్ర రాజధాని కొహిమాలోని అస్సాం రైఫిల్స్ యుద్ధ స్మారకంలో శ్రద్ధాంజలి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 1980 డిసెంబర్ 18న మోన్ జిల్లాలో ఉగ్రవాదులతో పోరాడుతూ వీరమరణం పొందిన నాయిక్ (లేట్) ఆర్.బి. ఛేత్రి (కీర్తి చక్ర మరణానంతరం), నాయిక్ (లేట్) ఎన్.ఎస్. డోగ్రా, లాన్స్ నాయిక్ (లేట్) కల్యాణ్ సింగ్ స్మృతికి ఈ కార్యక్రమం అంకితమైంది. వీర జవాన్ల త్యాగాన్ని స్మరిస్తూ అస్సాం రైఫిల్స్ అధికారులు, సిబ్బంది యుద్ధ స్మారక స్థలంలో పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

## వేయి స్తంభాల గుడి పునరుద్ధరణలో
## కీలక మైలురాయి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

- నాట్య మంటపం పునరుద్ధరణ పనులు పూర్తి...
- కాకతీయుల శిల్పకళా వైభవం కాపాడుతూ సంరక్షణ...
- వారసత్వ సంపద పరిరక్షణకు కేంద్రం నిబద్ధత...




**వరంగల్, డిసెంబర్ 19:** వరంగల్ హన్మకొండలోని చారిత్రక వేయి స్తంభాల గుడి పునరుద్ధరణ పనుల్లో కీలక మైలురాయిని అధిగమించడం ఆనందకరమని కేంద్ర సాంస్కృతిక శాఖ మాజీ మంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి అన్నారు. కాకతీయుల అద్భుత శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలిచే ఈ ఆలయ నాట్య మంటపం పునరుద్ధరణ పనులు తాజాగా పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే వేయి స్తంభాల గుడి పునరుద్ధరణకు అవసరమైన నిధులు కేటాయించామని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. గత నెలలో వరంగల్ పర్యటన సందర్భంగా ఆలయాన్ని సందర్శించి, పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షించినట్లు తెలిపారు. అప్పట్లో పనుల్లో జాప్యం జరగడంపై ఆరా తీసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రాచీన వారసత్వ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా, ఆలయ అసలైన కట్టడపు రూపురేఖలను కాపాడుతూ అత్యంత జాగ్రత్తగా పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు కిషన్ రెడ్డి వివరించారు. కాకతీయుల కాలం నాటి శిల్పకళ, నిర్మాణ నైపుణ్యం యథాతథంగా నిలిచేలా నిపుణుల పర్యవేక్షణలో పనులు నిర్వహించినట్లు తెలిపారు. భారతదేశపు అమూల్యమైన వారసత్వ సంపదను భావి తరాలకు అందించడమే లక్ష్యంగా గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వేయి స్తంభాల గుడి వంటి చారిత్రక కట్టడాల సంరక్షణ దేశ సాంస్కృతిక గౌరవాన్ని ప్రపంచానికి చాటేలా చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# డీజీపీ సమక్షంలో 41 మంది
# మావోయిస్టుల లొంగుబాటు

- ఆయుధాలతో సహా లొంగిపోయిన పీఎల్‌జీఏ, డివిజనల్ స్థాయి నేతలు...
- 24 ఆయుధాలు, 733 తూటాలు స్వాధీనం...
- పునరావాస విధానం కింద రూ.1.46 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు...

**హైదరాబాద్, డిసెంబర్ 19 :** నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి తెలంగాణలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో మొత్తం 41 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో పీఎల్‌జీఏ బటాలియన్‌తో పాటు డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉండటం గమనార్హం. ఈ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతాయని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ లేదా కంపెనీ కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా లేదా ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. వారి వద్ద నుంచి ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు సహా మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు తెలంగాణకు చెందినవారుగా అధికారులు తెలిపారు. నిలొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు తమ నిర్ణయానికి గల కారణాలను వెల్లడించారు. పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో ఎదురవుతున్న తీవ్రమైన జీవన కష్టాలు, భద్రతా బలగాల నిరంతర ఒత్తిడి కారణంగానే హింసను వీడి ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, సాధారణ పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తం మీద రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు అందనున్నట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు మరోసారి పిలుపునిచ్చారు.



## మీడియా మార్పులకు అనుగుణంగా
## ప్రభుత్వ ప్రచారం బలోపేతం చేయాలి



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..

**హైదరాబాద్, డిసెంబర్ 19 :** వేగంగా మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నాంపల్లిలో తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ప్రజా సంబంధాల అధికారుల పునశ్చరణ తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా వెలువడిన తెలంగాణ మాస పత్రిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. గత పాలకుల పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సంక్షోభాన్ని ఎదుర్కొందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం స్పష్టమైన దిశలో ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. కేవలం రెండేళ్లలోనే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ పాలనలో మార్పు కనిపిస్తోందన్నారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రభావం వేగంగా పెరుగుతోందని, దాన్ని ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారానికి శక్తివంతమైన సాధనంగా మలచుకోవాలని మంత్రి సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు డిజిటల్ మీడియాను సమన్వయంతో ఉపయోగించి ప్రభుత్వ విధానాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రజా సంబంధాల అధికారులపై ఉందని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే ప్రజా సంబంధాల అధికారుల పాత్ర మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి జిల్లాకు సమర్థవంతమైన డీపీఆర్‌వోల నియామకం జరగాలని, ఇతర విభాగాల నుంచి డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న విధానాన్ని రద్దు చేయాలని సూచించారు. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఐ&పీఆర్ కమిషనర్‌కు ఆదేశించారు. ఈ పునశ్చరణ తరగతులు అధికారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

## ఉపరాష్ట్రపతి నివాసంలో క్రిస్మస్ వేడుకలు



న్యూఢిల్లీ, డిసెంబర్ 19 : క్రిస్మస్ పండుగను ముందుగానే పురస్కరించుకుని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ నేడు ఉపరాష్ట్రపతి నివాసంలో క్రిస్మస్ లంచన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దేశ ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఐక్యత, శాంతి, సోదరభావాల ప్రాముఖ్యతను పేర్కొన్నారు. నిఈ వేడుకలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సి.వి. ఆనంద బోస్, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ పాల్గొన్నారు. అలాగే కేంద్ర సహాయ మంత్రులు జార్జ్ కురియన్, సురేష్ గోపీ కూడా హాజరై కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు.

## ఫర్టిలైజర్ యాప్ ద్వారానే యూరియా విక్రయాలు జరగాలి..

**-మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి...**

**జాంపేట,డిసెంబర్19 (మన వార్త ప్రతినిధి)**మండల కేంద్రంలోని రైతులు యూరియా విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని శుక్రవారం మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ నిర్వాహకులు ఫర్టిలైజర్ డీలర్ యాప్ పై అవగాహన కల్పించారు. నిఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీజన్‌లో యూరియా కోసం రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఫర్టిలైజర్ మొబైల్ యాప్ ద్వారా రైతులు తమ పంట వివరాలు,సాగు విస్తీర్ణం ఆధారంగా ముందుగానే యూరియాను బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. యాప్‌లో బుకింగ్ చేసిన రైతుకు ప్రత్యేక బుకింగ్ ఐడి లభిస్తుందని ఆ ఐడితో పాటు ఆధార్ కార్డు, పట్టా లేదా పాస్‌బుక్ చూపించి సంబంధిత ఎరువుల దుకాణంలో యూరియాను పొందవచ్చని వివరించారు. ఈ విధానం అమలులోకి వస్తే రైతులు,డీలర్లు, అధికారులు మూడు వర్గాలకూ ఎరువుల లభ్యతపై స్పష్టమైన సమాచారం అందుతుందని వివరించారు. పంటకు అవసరమైన మోతాదులోనే సరైన సమయంలో యూరియా సరఫరా జరిగి రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సకాలంలో ఎరువులు పొందుతారని అధికారులు స్పష్టం చేశారు. మొత్తానికి ఫర్టిలైజర్ మొబైల్ యాప్ ద్వారా యూరియా పంపిణీ విధానం రైతులకు మరింత ఉపయోగకరంగా మారనుందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ యాప్ పై గ్రామసభల ద్వారా రైతులకు తెలియజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు శ్రీలత,మౌనిక,రమ్య, సొసైటీ సీఈవో శోభ రాణి, ఆపరేటర్ రమేష్, ఫర్టిలైజర్ డీలర్ శ్రీనివాస్ గౌడ్,రంజిత్ గౌడ్, రాజు,వడ్ల శ్రీనివాస్, విశ్వనాథ్, రజనీకాంత్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.





## విశేషంగా వీరేశ్వరస్వామి స్వామికి రుద్రాభిషేకం



**భద్రాద్రి కొత్తగూడెం, చర్ల, డిసెంబర్ 19, (మనవార్త ప్రతినిధి):**చర్ల మండలం తేగడ గ్రామంలోని శివాలయంలో గురువారం నాడు మాస శివరాత్రి సందర్భంగా విశేషంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిగింది. సాయింత్రం ఆరు గంటల నుండి భద్రకాళీ సహిత వీరేశ్వరస్వామి వారి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. యజమాన దంపతులు ముత్తవరపు. దినేష్ ప్రత్యూష దంపతులు పీటల మీద కూర్చున్నారు. ఆలయ నిర్వాహకులు యల్లమందల.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు.భానుప్రకాష్ వైదిక కళ్యాణ క్రియ చేశారు. మాసంలో నాలుగు సోమవారాలు, మాస శివరాత్రి, పూర్ణిమ రోజుల్లో రాత్రి సమయంలో కళ్యాణములు ఉంటాయని తెలియజేశారు.

## గురుస్వాములను ఘనంగా సన్మానించిన దుబ్బ సమ్మయ్య



**భద్రాద్రి కొత్తగూడెం, చర్ల, డిసెంబర్ 19. (మన వార్త ప్రతినిధి)** :చర్ల మండలంలోని కొయ్యూరు గ్రామపంచాయతీ గ్రామంలో బాలరాజు, బాబురావు 18వ పడి గురుస్వాముల ఆధ్వర్యంలోని అయ్యప్ప భక్తులు 18మంది అయ్యప్ప మాల ధరించడం జరిగింది. 41రోజులు పాటు నిష్ఠ దీక్షతో ప్రతినిత్యం పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మూడవ సారి మాల ధరించిన దుబ్బ సమ్మయ్య తన ఇంటిదగ్గర బిక్ష ఏర్పాటు చేసి 18వ పడి గురుస్వాములైన ఇర్ప బాలరాజు, కొట్టెం బాబురావు స్వాములను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 25మంది అయ్యప్ప మాల ధరించిన స్వాములు, గ్రామ పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**-సహాయ వ్యవసాయ సంచాలకులు.. ఎన్. విజయ చంద్ర...**

**మధిర,డిసెంబర్ 19(మన వార్త):**రైతులు ఎరువుల దుకాణాల వద్ద వేచి ఉండకుండా,సాగు చేసిన పంటలకు సరిపడా యూరియా సకాలంలో అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న యూరియా బుకింగ్ యాప్ ఈ నెల 20 నుంచి అమల్లోకి రానుందని మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ విజయ చంద్ర తెలిపారు. ఈ మేరకు అయన శుక్రవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. యూరియా కొరకు రైతులు దుకాణాల వద్ద నిరీక్షించాల్సిన అవసరం లేకుండా,పారదర్శకంగా ఎరువుల పంపిణీ జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ యాప్ రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా రైతు ఎక్కడి నుంచైనా తనకు అనుకూలమైన డీలర్ వద్ద యూరియాను బుక్ చేసుకోవచ్చని చెప్పారు.రైతు యాప్‌లో సాగు చేసిన పంట వివరాలు నమోదు చేస్తే, అవసరమైన యూరియా కోటా యాప్‌లో కనిపిస్తుందని వివరించారు. ఒక్కో దఫాలో 5 బస్తాల చొప్పున బుకింగ్ చేసుకునే అవకాశం ఉండగా,ఒకసారి కొనుగోలు చేసిన తరువాత 15 రోజుల విరామంతో మాత్రమే తదుపరి రెండు దఫాల్లో కొనుగోలు చేయగలరని పేర్కొన్నారు.రైతు యూరియా బుకింగ్ చేసిన వెంటనే బుకింగ్ ఐడి నంబర్ అందుతుందని,ఆ ఐడి నంబర్ తొ పాటు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని బుక్ చేసిన మరుసటి రోజులోపు డీలర్ వద్ద యూరియా కొనుగోలు చేయవచ్చన్నారు. ఒకవేళ బుక్ చేసుకున్న యూరియాను రైతు కొనుగోలు చేయకపోతే బుకింగ్ రద్దవుతుందని, అటువంటి సందర్భంలో 24 గంటల తర్వాత మళ్లీ బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ పై అవగాహన..

**రామాయంపేటని డిసెంబర్ 19ని( మన వార్త ప్రతినిధి)**రామాయంపేటలో రైతులు యూరియా కొనుగోలు కేవలం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారానే చేయాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల రైతులు ఎరువుల దుకాణాల వద్ద క్యూ లైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా, తమ పంట విస్తీర్ణం ఆధారంగా అవసరమైన యూరియా సమయానికి ముందుగానే బుక్ చేసుకునే సౌకర్యం లభిస్తుంది. జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ రామాయపేటలోని సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం ఆవరణలో రైతులకు ఈ యాప్ డౌన్లోడ్ చేయడం, యాప్ ఉపయోగించే విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీజన్‌లో రైతులు యూరియా కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న దృష్ట్యా, ఈ యాప్ మాధ్యమంగా రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందే విధంగా వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా ఈ వ్యవస్థను రూపొందించిందని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ కలిగిన రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుండీ “ఫర్టిలైజర్ బుకింగ్ ఆప్ డౌన్లోడ్ చేసుకొని, తమ మొబైల్ నంబర్ ఆధారంగా ఌూ ద్వారా రిజిస్టర్ కావచ్చని తెలిపారు. ఈ-పాస్ మెషిన్ ద్వారా మాత్రమే నిర్వహించాలన్న ఆదేశాలను జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ రాజనారాయణ, నార్సింగి మండల వ్యవసాయ అధికారి శ్రీ భరత్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.



## భట్టి విక్రమార్క ని విమర్శించే స్థాయి నీది కాదు కమల్ రాజ్

**-సూరం శెట్టి కిషోర్...**

**మధిర, డిసెంబర్19( మన వార్త):**జిల్లా పరిషత్ చైర్మన్ గా చేసి మిడిమిడి జ్ఞానంతో వార్డు మెంబర్ స్థాయికి దిగజారి ఇలా మాట్లాడటం సరైనది కాదు.బి ని ఈరోజు మధిర పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ..నినితెలంగాణా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లుభట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క విమర్శించే స్థాయి నిది కాదు కమలరాజ్, నువ్వు ఒక మాజీ జడ్పీ చైర్మన్ అని మర్చిపోయినట్టున్నావ్. నైతిక విలువల గురించి అసలు నీకు ఏమి తెలుసు లోపల కౌంటింగ్ జరుగుతుంటే మీ ఏజెంట్లు, మీ అభ్యర్థి ఏం చేస్తున్నారు. కౌంటింగ్ జరిగేది చిన్న హాల్ పోలింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు అభ్యర్థులు అందరూ ఉంటారు. కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంటే మీ ఏజెంట్లు ఏం చేస్తున్నారు లోన ఏం జరిగిందో మీ కౌంటింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు తెలియదా.. కౌంటింగ్ జరుగుతుంటేనే ఫలితాలు రాకముందే మీ పార్టీ వారు గెలిచామని సంబరాలు చేసుకొని తీరా ఓడిపోయాక దానిని సరిదిద్దడం కోసం భట్టి విక్రమార్క మీద మల్లు నందిని విక్రమార్క మీద అబాండాలు వేస్తున్నావు, రాష్ట్రంలో రీకౌంటింగ్ లో ఒకటి రెండు ఓట్లతో గెలుపొందిన ఎంతో మంది సర్పంచి అభ్యర్థులు ఉన్నారు. అందులో మీ బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు కూడా ఉన్నారు, మరి అక్కడ ఫలితాలు తారుమారు చేయలేదేందుకు ప్రజా ప్రభుత్వంలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలని భట్టి విక్రమార్క అనుకుంటున్నారు. ఒక ఎలక్షన్ ఆఫీసర్ కి ఫోన్ చేస్తే రిజల్ట్ మారే పరిస్థితి ఉంటదా అది మీకు తెలియదా, ఆ గ్రామాల్లో ఎవరో చెప్పారని మిడిమిడి జ్ఞానంతో వార్డు మెంబర్ స్థాయికి దిగజారి మీరు ఇలా మాట్లాడటం సరైనది కాదు. మల్లు భట్టి విక్రమార్క ఎలక్షన్ లు నిబద్ధతతో జరగాలని ఏ ఊరిలో గాని ప్రచారం చేయలేదు. టిఆర్ఎస్ పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా 11, 12 శాతం ఫలితాలు వస్తే, మీరు వంగవీడు, చిలుకూరు అని మాట్లాడటం బాధాకరంగా ఉంది. పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు మీరు అధికారంలో ఉన్నప్పుడు చేసినవన్నీ ఇప్పుడు మీకు గుర్తొస్తున్నట్టుగా ఉన్నాయి, కానీ ఇప్పుడున్న ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వంలో ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్లు మాత్రమే ఉంటారు ఉపముఖ్యమంత్రి అయినది దీనికే అని మాట్లాడుతున్నారు ఉప ముఖ్యమంత్రి అయింది ఎందుకో ప్రజలను అడగండి ఇంట్లో కూర్చున్న మీకు ఏం తెలుస్తుంది ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసం రాష్ట్ర మొత్తం1300 కిలోమీటర్లు పాదయాత్ర చేసి మీ ప్రభుత్వం ఇవ్వని రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇల్లు, పేదలకు ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, ప్రజల ఇబ్బందులు గ్రహించి ప్రజా ప్రభుత్వం ఇస్తూ ఉంటే ఇవన్నీ మర్చిపోయి ఫలితాలు తారు మారు చేయటం కోసం భట్టి విక్రమార్క , మల్లు నందిని విక్రమార్క ఫోన్ చేసి మాట్లాడారు అని మీరు మాట్లాడటం విడ్డూరంగా ఉంది.ప్రజా ప్రభుత్వంలో ప్రజలు చే ఎన్నుకోబడిన సర్పంచులు ఎంపీటీసీలు ఎమ్మెల్యేలు మాత్రమే ఉంటారు తప్ప మీ ప్రభుత్వంలో మీ నాయకుడు మెప్పు పొందిన వాళ్లు ఉన్నట్లు ఉండరు ఇది తెలుసుకొని మాట్లాడండి అని అన్నారు..నిఈ సమావేశంలో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిరియాల వెంకటరమణ గుప్తా మండల బీసీ సెల్ అధ్యక్షుడు చిలువేరు బుచ్చిరామయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాణావత్ వెంకటరమణ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, పత్తేపరపు సంగయ్య, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు బిట్రా ఉద్దండయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైలవరపు చక్రి, ఓబుల్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు



## భద్రాచలంలో తెలంగాణ జాగృతి ర్యాలీ ఆంధ్రాలో కలిసిన గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలి



**-ఎమ్మెల్సీ కవిత డిమాండ్....**

**భద్రాచలం, డిసెంబర్ 19. ( మన వార్త ప్రతినిధి ).**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా ఆంధ్రాలో అన్యాయంగా కలిసిన గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలంలోని కేకే ఫంక్షన్ హాల్లో ప్రజాభిప్రాయ సదస్సు నిర్వహించబడింది. సదస్సులో కవిత మాట్లాడుతూ “తెలంగాణ సరిహద్దులోని కొన్ని గ్రామాలు చట్టవిరుద్ధంగా ఆంధ్రాలోకి కలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఈ గ్రామాలను తిరిగి తెలంగాణలో చేర్చడం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బొలిశెట్టి రంగారావు మాట్లాడుతూ, బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకై చేస్తున్న పోరాటానికి మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు కలిపి సుమారు 80 శాతం ఉన్నప్పటికీ, నామినేటెడ్ పోస్టులలో అగ్రవర్ణాలకు మాత్రమే అవకాశాలు లభిస్తున్నాయని, ఈ అన్యాయాన్ని సరిచేయాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో తమ న్యాయమైన కోరికలకు గళం వినిపించాలని కోరుతూ వినతి పత్రం కూడా సమర్పించారు. ఈ సమావేశంలో బీసీ ఐక్యవేదిక గౌరవాధ్యక్షులు తాళ్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి బండారు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు అనుగోజు నరసింహ చారి, ట్రెజరర్ కోపనాతి శాంతారావు, నాయకులు మల్లాడ శ్రీధర్, దుర్గపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గుగ్గిళ్ల నూతన సర్పంచ్ మల్లయ్యకి ఘనంగా సన్మానం



**-సివిల్స్ మెంటర్ నారోజు శంకరా చారి...**

**బెజ్జంకి, డిసెంబర్ 19(మన వార్త ప్రతినిధి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామ నూతన సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్యని సివిల్స్ మెంటర్ నారోజు శంకరాచారి నూతన సర్పంచ్ కి,గ్రామ పంచాయితీ నూతన పాలక వర్గానికి ముందస్తుగా శుభాకాంక్షలు తెలపి సర్పంచ్ నీ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను,అంకితభావనతో గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలని,ప్రభుత్వ పథకాలను లబ్దిదారులందరికి చేరేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారోజు భాస్కర్,చెప్యాల సంతోష్ పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ బుకింగ్ ఆప్ ద్వారానే ఎరువులు కొనుగోలు చేయాలి...




**నార్సింగి డిసెంబర్ 19 ( మన వార్త ప్రతినిధి )** ప్రతీ రైతు యూరియా కొనుగోలు ను, డీలర్ యూరియా అమ్మకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన “ఫెర్టిలైజర్ బుకింగ్ ఆప్“ ద్వారా మాత్రమే జరపాలని మండల వ్యవసాయ అధికారి భరత్ కుమార్ అన్నారు. ఈ ఆప్ గూగుల్ ప్లే స్టోర్ లో అందుబాటులో ఉందని, ఉపయోగించడం కూడా సులభమని, అక్కడి నుంచి తమ ఫోన్ కు డౌన్లోడ్ చేసుకోవాలని అన్నారు. ఆప్ లో మూడు విభాగాలు 1. రైతులు/సిటిజన్, 2. డిపార్ట్మెంట్ (అగ్రికల్చర్), 3. డీలర్ ఉన్నాయని అన్నారు. రైతు తన మొబైల్ నెంబర్ ఆప్ లో వేసాక ఒక ఓటీపీ వస్తుందని, ఓటీపీ నమోదు చేసి తన పట్టాదారు పాస్ బుక్ నెంబర్ ను నమోదు చేసిన అనంతరం పాస్ బుక్ కు లింక్ ఉన్న నంబర్ కు మరో ఓటీపీ వస్తుందని, దానిని నమోదు చేస్తే రైతు గ్రామం, బుక్ లో గల విస్తీర్ణం కనిపిస్తుందని వివరించారు. అక్కడ రైతు ఏ పంట ఎంత విస్తీర్ణంలో వేశారు అన్నది నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ వివరాలు నమోదు చేసిన తర్వాత “బుక్ ఫెర్టిలైజర్ “ లో వెళితే జిల్లా లో అందుబాటులో ఉన్న యూరియా సంచుల వివరాలు తెలుస్తాయని, మండలం పేరు వేస్తే ఏ డీలర్ వద్ద ఎన్ని సంచులు నిల్వ ఉన్నాయి అన్న వివరాలను తెలుపుతుందని అన్నారు. ఎకరం లోపు విస్తీర్ణానికి ఒక దఫాలో, ఎకరం నుంచి 5 ఎకరాల లోపు విస్తీర్ణానికి రెండు దఫాలుగా, 5 నుంచి 20 ఎకరాల లోపు వారు మూడు దఫాలుగా, 20 ఎకరాల పైన విస్తీర్ణానికి నాలుగు దఫాలుగా యూరియా బుక్ చేసుకోవాలని అన్నారు. రైతు ఒకసారి యూరియా కొనుగోలు చేసిన తర్వాత 15 రోజులకు రెండవ దఫా కొనుగోలు చేయవచ్చని చెప్పారు. రైతులు ముఖ్యంగా గమనించాల్సిన విషయం గురించి తెలుపుతూ రైతు స్లాట్ బుక్ చేసుకున్నాక 24 గంటలలో యూరియా తీసుకోవాలని, లేక పోతే స్లాట్ గడువు ముగిసిపోయి ఆ స్లాట్ లో యూరియా కొనుగోలు కు అవకాశం ఉండదని మండల వ్యవసాయ అధికారి భరత్ కుమార్ అన్నారు.

## తెలుగుదేశం కుటుంబ సభ్యులకు ఆహ్వానం

**మధిర డిసెంబర్19( మన వార్త):**గౌరవనీయులైన తెలుగుదేశం కుటుంబ సభ్యులరా నమస్కారములునిఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతి ఎన్నికలలోఎన్నికయిన టీడీపీ బలపరచిన సర్పంచులను ఉ పసర్పంచులను వార్డ్ మెంబెర్స్ ను అభినందించే సన్మాన కార్యక్రమం ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ది 20-12-25 శనివారం రోజున మద్యాహ్నం 2.30 గంటలకు ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ అధ్యక్షతన జరుగును ముఖ్యఅతిధులునిబక్కని నరసింహులునిజాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోలిట్ బ్యూరో సభ్యులునినన్నూరు నర్సిరెడ్డి టీటీడీపీ అధికార ప్రతినిధి తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ మెంబర్ నిఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర పార్టీ నాయకులు, రాష్ట్ర అనుబంధ సంఘ నాయకులు,జిల్లా, నియోజకవర్గాల, మండలాల, గ్రామ శాఖల నాయకులు కార్యకర్తలు సానుభూతి పరులు పాల్గొని నూతనంగా ఎన్నికయిన పంచాయతీ ప్రజా ప్రతినిధులను సత్కరించి సన్మానించెదరు తదుపరి త్వరలో రాష్ట్రంలో పార్టీల పరంగా జరగబోయేనిఎంపీటీసీ జడ్పీటీసీ మున్సిపాలిటీ ఎన్నికల గురించి చర్చించటం జరుగును కావున తమందరూ సకాలంలో పాల్గొనందులకు కోరుతూ ఆహ్వానిం చటమైనది నిఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ

## మన వార్త కథనానికి స్పందన




**-భారీ వాహనాల కారణంగా ధ్వంసమైన రోడ్డు తాత్కాలిక మరమ్మత్తు...**

**బెజ్జంకి,డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి):**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామం నుంచి బెజ్జంకి క్రాసింగ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని రెండు రోజుల క్రితం మన వార్త పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు శుక్రవారం ఉదయం రహదారిపై తాత్కాలిక మరమ్మత్తు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రాకపోకలు కొనసాగేందుకు చర్యలు తీసుకున్నారు. సమస్యపై స్పందించి తాత్కాలికంగా మరమ్మత్తులు చేపట్టిన అధికారులకు గ్రామ ప్రజలు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రజల సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన మన వార్త రిపోర్టర్‌కు కూడా గ్రామస్తులు, వాహనదారులు ధన్యవాదాలు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధి బీ జె పి తోనే సాధ్యం..

**- బిజెపి సర్పంచ్ లకు సన్మానం....**

**జమ్మికుంట, డిసెంబర్ 19( మన వార్త ప్రతినిధి):**పంచాయితి ఎన్నికలలో నిహుజురాబాద్ నియోజకవర్గంలో గెలిచిన సర్పంచ్ లను శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి , పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు లు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ఇస్తున్న నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ప్రజలంతా బలంగా విశ్వసించడంతోనే మొదటి, రెండో, మూడో విడత ఎన్నికల ఫలితాల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించారన్నారు. మోడీ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ఆ దిశగానే 2014 లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఇన్నేళ్లుగా గ్రామాల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గత పది సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలతోనే గ్రామాల ముఖచిత్రం మారిందని తెలిపారు. గత బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయన్నారు. నాటి కెసిఆర్ సర్కార్ సర్పంచుల జీవితాలతో చెలగాటమాడిందని, ఎంతోమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే దయనీయ పరిస్థితి బిఆర్ఎస్ పాలనలో నే వచ్చిందన్నారు. సర్పంచులను ఆదుకుంటామని, గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఊదరగొట్టి, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లుగా గ్రామాల కోసం చేసిందేమీలేదన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పంచాయతీలను నిర్వీర్యం చేసిన ఘనత కాంగ్రెస్ సర్కార్ కు దక్కుతుందన్నారు. గ్రామాల అభివృద్ధి ,పంచాయతీ వ్యవస్థను చక్కదిద్దే ఆలోచన కాంగ్రెస్ కి లేదన్నారు. గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని, ఆ దిశగా బిజెపి సర్పంచ్ లు గెలుపొందిన గ్రామాలను మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సర్పంచులు రాగం శ్రీనివాస్, వలిగే కళ్యాణి, ఉప్పు మహేష్, దాట్ల వీరస్వామి, బైరెడ్డి వెంకటరమణారెడ్డి, ముషం సంగీత , మంతెన సుమలత, ఉప సర్పంచ్లు దొంతర వీణ రమేష్ యాదవ్, లింగమూర్తి, చెట్ల అనిత, పూరీల కుమార్ మరియు బిజెపి వార్డు మెంబర్లు బిజెపి నాయకులు పుప్పాల రఘు, చిన్న మాధవి నరసింహారాజు, ఆకుల రాజేందర్, వినుకొండ నాగేశ్వర్ రెడ్డి, గుర్రాల వెంకటరెడ్డి, గుజ్జ శ్రీనివాస్, సంపెల్లి సంపత్ రావు, కొలకాని రాజు, బచ్చు శివన్న, కైలాస కోటి గణేష్, సిరియాల విజయ్, గాండ్ల శ్రీనివాస్, పుల్లూరు ఈశ్వర్, కొల్లూరి రాకేష్, కనబోయిన సమ్మయ్య, ఐలయ్య, రాజ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై అవగాహన

**-గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి..**

**ఇల్లంతకుంట,డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి):**ఇల్లంతకుంట మండలంలోని పెద్ద లింగాపూర్ రైతు వేదికతో పాటు అనంతారం,రామాజీపేట గ్రామ పంచాయతీల్లో డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ రూపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేష్ రెడ్డి ఆదేశాల మేరకు,గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి ప్రతి గ్రామాన రైతులకు యాప్‌లో యూరియాను ఎలా బుక్ చేసుకోవాలి,నమోదు ప్రక్రియ, ముందురోజే స్లాట్ బుకింగ్ తప్పనిసరిగా చేయాల్సిన నియమాలు వంటి వివరాలను వివరించారు. ఈ యాసంగి పంటకాలం నుంచి ప్రతి రైతు బుకింగ్ ఐడి ఉంటేనే యూరియా కొనుగోలు చేయవచ్చని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేతిరెడ్డి సుధాకర్ రెడ్డి,గన్నారం నరసయ్య, జంగం శ్రీనివాస్‌తో పాటు పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.




## కోరపల్లి సర్పంచ్ ఎన్నికల్లో అవకతవకలు..!



**జమ్మికుంట, డిసెంబర్ 19( మన వార్త ప్రతినిధి):**హుజూరాబాద్ నియోజకవర్గశీ జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని స్వతంత్ర అభ్యర్థి పల్లె రవికుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా కోరపల్లి గ్రామం నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశానని, తన ఎన్నికల గుర్తు ఫుట్‌బాల్ అని రవికుమార్ గౌడ్ తెలిపారు. అయితే ఎన్నికల నిర్వహణలో నిబంధనలను బేఖాతరు చేస్తూ వ్యవహరించారని ఆరోపించారు. కోరపల్లి గ్రామానికి ప్రిసైడింగ్ అధికారిగా నియమితుడైన అలుగువెల్లి జగన్ సారోత్తం రెడ్డి (పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు) ఎన్నికల నిబంధనలను పాటించలేదని, ఎంఈఓ సహకారంతో కొందరు అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గెలిచిన అభ్యర్థి ఇంటి పక్కనే తన నివాసం ఉండటంతో, వ్యక్తిగత పరిచయాల ఆధారంగా పక్షపాతంగా వ్యవహరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. గ్రామంలోని పోలింగ్ బూత్ నంబర్2, 5వ వార్డు పరిధిలో తప్పుడు ఓటింగ్ జరిగిందని, కౌంటింగ్ సమయంలో కూడా ఒక నిర్దిష్ట గుర్తు ఉన్న అభ్యర్థికి అనుకూలంగా సహకరించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఫుటేజ్ ఉన్నప్పటికీ, వాటిని పరిశీలించేందుకు అధికారులు నిరాకరించారని తెలిపారు. అలాగే తనకు వచ్చిన ఓట్ల వివరాలను చూపించడానికి కూడా అధికారులు అంగీకరించలేదని, దీంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయని రవికుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**-రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద...**

**మంచిర్యాల, డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి):**చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కమ్యూనిటీ భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి హాజరై కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా చెన్నూరు మండల కేంద్రంలో 20 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం జరిగిందని, భవనం మరింత విస్తరించేందుకు అదనంగా మరో 20 లక్షల రూపాయలను మంజూరు చేసి అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కమ్యూనిటీ భవనాన్ని దళిత సంఘాలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నిర్దేశిత నిబంధనలతో భవన నిర్వహణ కొరకు కమిటీ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇదే తరహాలో భీమారం మండలంలో 25 లక్షల రూపాయలతో నేతకాని భవనం, జైపూర్ మండలంలో 25 లక్షల రూపాయల వ్యయంతో జగ్జీవన్ రామ్ భవనం, చెన్నూరు మండలంలో 25 లక్షల రూపాయల వ్యయంతో ముదిరాజ్ భవనం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా భవనాలకు అదనపు నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కమ్యూనిటీ భవన నిర్మాణం కొరకు భూమి కలిగి ఉన్నట్లయితే ప్రభుత్వం తరఫున భవన నిర్మాణానికి చేయూత ఇస్తామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో 15 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, వచ్చే విడతలో 70,80 కోట్ల రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు త్రాగునీటి కొరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమృత్ పథకం ద్వారా నీటి ట్యాంకులు, పైప్ లైన్లు ఏర్పాటు చేసి నిరంతరం త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూరు ప్రాంతంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని, మే నెల వరకు ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు, ఆసుపత్రిలో తగినంత సిబ్బంది నియామకానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం 9 కోట్ల 55 లక్షల రూపాయల టియుఎఫ్ఐడిసి నిధులతో చేపట్టిన సమీకృత కూరగాయల మార్కెట్ ను ప్రారంభించారు. ప్రజలందరికీ ఒకే చోట కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు అందుబాటులో ఉంచేందుకు సమీకృత మార్కెట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, మాంసం ఉత్పత్తులకు సంబంధించి మార్కెట్లో నెలకొన్న సాంకేతిక సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూరు మండల కేంద్రంలోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మాత శిశు ఆసుపత్రిగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి కిడ్నీ బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకం క్రింద చెన్నూరు మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 40 కోట్ల రూపాయలు, మందమర్రి మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలతో ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అంబేద్కర్ భవనాన్ని ప్రజలు బహుళ ప్రయోజనాల కోసం వినియోగించుకోవచ్చని, ఈ భవనంలో గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమీకృత కూరగాయల మార్కెట్ ఏర్పాటు ద్వారా వీధి వ్యాపారులకు ఒక ఫ్లాట్ ఫాం ఏర్పాటుచేసి ఒకే చోట ప్రజలందరికీ కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని, సమీకృత మార్కెట్ లో సామూహిక సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా పైప్ లైన్లు, 3 నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణంలో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి చేయడం జరిగిందని, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రాంతంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధితో పాటు ప్రజల సౌకర్యార్థం అంతర్గత రహదారులు, మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన వైద్యాధికారులు, సిబ్బందిని నియమించి ప్రజలకు వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం చెన్నూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో సమీక్షించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, చెన్నూరు తహశీల్దార్ మల్లికార్జున్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## జనవరి, ఫిబ్రవరి నెలలలో జరిగే యు జి సి - ఎన్ ఈ టి - 2026

**-జేఈఈ -2026లకు అర్హత పరీక్ష ఆన్లైన్ లో నిర్వహణకు మే నెలలో నీట్ ఎన్ ఈ ఈ టి -2026 ఆఫ్-లైన్ లో జరగబోయే పరీక్షకు సంబంధించి జిల్లాలో నిర్వహణ సమావేశం...**

**-జిల్లా కలెక్టర్ కె. హైమావతి...**

**సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 19,( మన వార్త ప్రతినిధి)** శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలలో జరిగే యు జి సి - ఎన్ ఈ టి - 2026 మరియు జే ఈ ఈ -2026లకు అర్హత పరీక్ష ఆన్లైన్ లో నిర్వహణకు మే నెలలో నీట్( ఎన్ ఈ ఈ టి )-2026 ఆఫ్ లైన్ లో జరగబోయే పరీక్షకు సంబంధించి జిల్లాలో నిర్వహణ గూర్చి జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమావేశం నిర్వహించారు. నిఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...నిజిల్లాలో యు జి సి - ఎన్ ఈ టి - 2026 కోసం ఒక సెంటర్, జేఈఈ -2026 కోసం 2 సెంటర్ లలో నిర్వహించే ఆన్లైన్ పరీక్షలకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ( ఎన్ టి ఏ) మార్గదర్శకాల ప్రకారం సెంటర్ లను ఎంపిక చేసి ఆ సెంటర్ లో సీసీ కెమెరా, పవర్ సప్లై, వాటర్ ఫెసిలిటీ, ఫర్నిచర్, టాయిలెట్స్, కంప్యూటర్లు, నెట్ సౌకర్యం ఇతరత్రా అన్ని సౌకర్యాలు చెక్ చేయాలని అధికారులను ఆదేశించారు. సెంటర్ లను తనిఖీ తర్వాత ఆ నివేదికను( ఎన్ టి ఏ) కు పంపించాలని తెలిపారు. నిఈ సమావేశం లో డిఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఏఓ రాజ్ కుమార్, కెవి ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్, నవోదయ స్కూల్ ప్రిన్సిపల్ రాజేందర్, పోలీస్, ఎన్ఐసి అధికారులు తదితరులు ఉన్నారు.



## ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణమే స్పందించేలా సిద్ధంగా ఉండాలి

**–జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి సుధీర్ బాల్...**

**మంచిర్యాల, డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి):**ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణమే స్పందించి ప్రజారక్షణ చర్యలు చేపట్టేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి సుధీర్ బాల్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి




రామకృష్ణారావు, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, నీటిపారుదల, పశుసంవర్ధక, పోలీస్, వ్యవసాయ, అగ్నిమాపక, రహదారులు, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య ఇతర అధికారులతో రక్షణ చర్యల ప్రణాళిక రూపకల్పన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి మాట్లాడుతూ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా అన్ని శాఖల సమన్వయంతో పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజా రక్షణ పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో వరదలు సంభవించినప్పుడు జాతీయ, రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థల సమన్వయంతో వరద ప్రభావిత ప్రాంతాలలో ఆర్మీ సిబ్బంది వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రమాద సమయంలో ప్రజలకు చేయవలసిన ప్రమాద హెచ్చరికలు, ప్రజా అవగాహన కొరకు చేపట్టవలసిన చర్యలు తెలుసుకోవాలని, అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాప్(సిఏపి) వ్యవస్థ, అత్యవసర నిర్వహణ కేంద్రాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, విపత్తుల సమయంలో వినియోగించుకుని చేపట్టవలసిన ప్రజా రక్షణ చర్యలను అమలు చేయాలని తెలిపారు. వర్షాల సమయంలో వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు ముందుగా హెచ్చరికలు జారీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్, నేషనల్ డేటా బేస్ ఫర్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ద్వారా వివరాలు తీసుకొని రక్షణ చర్యల దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు వారి పరిధిలోని విపత్తు ప్రభావిత ప్రాంతాలను తక్షణమే గుర్తించాలని, క్రమబద్ధమైన నిర్వహణ ప్రక్రియ కలిగి ఉండాలని తెలిపారు. పునరావాస కేంద్రాలలో కనీసం 10 రోజులు ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖలు తమ పరిధిలో చేపట్టవలసిన రక్షణ చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండి విపత్తు సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డిసెంబర్ 22వ తేదీన అన్ని జిల్లాలలో మాక్ డ్రిల్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని చెన్నూరు మండల తహశీల్దార్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల రక్షణ దిశగా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ, పునరావస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన ఆహారం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల సమన్వయంతో ప్రజల రక్షణ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు...

**–రైతులు పంట మార్పిడి పద్ధతి అలవర్చుకోవాలి...**

**–జిల్లా హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్...**

**చిన్న శంకరంపేట డిసెంబర్ 19 ( మన వార్త ప్రతినిధి)** ప్రత్యామ్నాయ పంటల సాగుగా ఆయిల్



ఫామ్ పంట సాగు చేసినట్లయితే అధిక లాభాలు పొందవచ్చని రైతులు పంట మార్పిడి పద్ధతి కొనసాగించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రతాప్ ప్రతాప్ సింగ్ తెలిపారు. చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామంలో రైతు సత్యనారాయణ వ్యవసాయ పొలంలో సాగుచేసిన ఆయిల్ ఫామ్ మొక్కలు 39 నెలలకు రావడంతో వాటికి అవసరమైన పరపరాగాసంపర్కం లో ఉపయోగపడే వివిల్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్ ఆయిల్ ఫామ్ కంపెనీ డైరెక్టర్ రంగనాయకులు లు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2000 ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంటలు వేయడం జరిగిందని అవసరమైన రక్షణ పంట పెంపుదలకు అవసరమైన సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మగ్గు చూపాలని ఆయిల్ ఫామ్ పంట సాగుకు ముందుకు రావాలని కోరారు ఆయిల్ పంప్ పంటతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఆయిల్ ఫామ్ పంట సాగు చేస్తూ అంతర్గత పంటలు కూడా వేసుకోవచ్చని దీంతో రైతులు మరింత ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. వివిల్స్ వదలడంతో పంటగా ఏపుగా పెరిగి అధిక లాభాలను అందించనున్నదని అన్నారు, రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగుకు ముందుకు రావాలని వారు కోరారు, మొక్కలు నాటిన మూడు సంవత్సరాల తర్వాత పంట దిగుబడి చేసుకోవచ్చని ఆయిల్ పాం పంటకు నీరు కూడా చాలా తక్కువ ఖర్చు అవుతుందని కోతుల బెడద దొంగల బెడద కూడా ఉండదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్ ఆయిల్ ఫామ్ కంపెనీ డైరెక్టర్ రంగనాయకులు మేనేజర్ కృష్ణారావు, హార్టి కల్చర్ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెద్దాం

**–త్వరలోనే కొత్త సర్పంచులతో సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తాం...**

**–మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు అశోక్ రెడ్డికి సన్మానం...**

**–గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి...**

**గజ్వేల్ డిసెంబర్ 19 మన వార్త ప్రతినిధి** గజ్వేల్ నియోజకవర్గంలో అత్యధిక సర్పంచ్ స్థానాలను



దక్కించుకొని కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని, అయితే కార్యకర్తల కష్టంతోనే ఇది సాధ్యపడిందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ మండల సర్పంచ్ల ఫోరం ఎన్నికలు జరగగా, పిడిచెడ్ సర్పంచ్, న్యాయవాది అశోక్ రెడ్డిని అధ్యక్షులుగా ఉపాధ్యక్షులుగా కోమటిబండ సర్పంచ్ అమరేందర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి వారిని సత్కరించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెద్దామని స్పష్టం చేస్తూ ఊహించని విధంగా గణనీయమైన ఫలితాలు సాధించినట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో సత్తా చాటుదామని స్పష్టం చేశారు. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ను ఇక్కడి ప్రజలు ఫాంహౌజ్ కు పరిమితం చేయగా, వచ్చిన ఫలితాలతో ఇంకా ఆయన ఏ ముఖం పెట్టుకొని తిరుగుతారని ఎద్దేవా చేశారు. గజ్వేల్ ప్రజల సమస్యలను గాలికొదిలిన కేసీఆర్, రెండేళ్ల కాలంలో రూ రెండు కోట్ల ప్రజల సొమ్మును అప్పనంగా మెక్కినట్లు విమర్శించారు. త్వరలోనే ఇక్కడి నూతన సర్పంచులను సీఎం రేవంత్ రెడ్డి వద్దకు తీసుకెళ్లి తగిన నిధులు సాధిస్తామని, వాస్తవాలను జీర్ణించుకోలేని కొందరు బిఆర్ఎస్ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ వివిధ గ్రామాల సర్పంచులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కెమిస్ట్ మహిళల సాయంతో విద్యార్థులకు రగ్గుల పంపిణీ

**–సరస్వతి శిశు మందిర్ విద్యార్థులకు 140 రగ్గుల అందజేతనిలి కిట్టీ పార్టీ ద్వారా సేకరణ విద్యార్థులకే సాయం...**

**భద్రాచలం, డిసెంబర్ 19. ( మన వార్త ప్రతినిధి ).**కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భద్రాచలం మహిళా సభ్యులు



సామాజిక బాధ్యతలో భాగంగా మరోసారి సేవా కార్యక్రమం చేపట్టారు. సభ్యులు నిర్వహించిన కిట్టీ పార్టీ ద్వారా సేకరించిన నగదు సహాయంతో రూ.15 వేల రూపాయల విలువైన 140 రగ్గులను సరస్వతి శిశు మందిర్ అవాస విద్యాలయం విద్యార్థులకు ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శిశు మందిర్ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కెమిస్ట్ మహిళలు ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు చేయూతనిచ్చే కార్యక్రమాలతో మంచి ఉదాహరణగా నిలుస్తున్నారు అన్నారు. అధ్యాపకురాలు గీతా మాట్లాడుతూ ఈ రగ్గులు విద్యార్థులకు శీతాకాలంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భద్రాచలం అధ్యక్షులు సోమశేఖర్ పరిమి మాట్లాడుతూ సంస్థ మహిళా సభ్యులు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను సక్రమంగా కొనసాగిస్తున్నారని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమ సంఘం కట్టుబడి ఉంటుందని తెలిపారు. గతంలో కూడా కెమిస్ట్ మహిళా సభ్యులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, హాస్టల్లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, కెమిస్ట్ మహిళా సభ్యులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

## ఢిల్లీ ఇండియన్ హాబిటాట్ సెంటర్‌లో ఎఫ్‌సీసీఐ అంతర్జాతీయ కాన్ఫరెన్స్

**–ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ...**

**–నెదర్లాండ్స్ ఎన్ఆర్ఐలకు తెలంగాణలో పెట్టుబడులు పిలుపు...**

**మంచిర్యాల, డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి):**ఢిల్లీలోని ఇండియన్ హాబిటాట్ సెంటర్‌లో నెదర్లాండ్స్‌లో స్థాపితమైన ఫౌండేషన్ ఫర్ క్రిటికల్ ఛాయిసెస్ ఫర్ ఇండియా (ఎఫ్ సిసిఐ)




ఆధ్వర్యంలో రెండు రోజులు జరగనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో నెదర్లాండ్స్‌కు నిచెందిన పెద్ద సంఖ్యలో భారత డయస్పోరా పాల్గొనగా, ఇండియా డయస్పోరా: డెడికేటెడ్ టు ది ప్రోగ్రెస్ ఆఫ్ ఇండియా అనే అంశంపై జరిగిన సమావేశంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రసంగించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, భవిష్యత్ పెట్టుబడుల రంగంలో భారత్‌దేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక, వాణిజ్య, నూతన సాంకేతిక రంగాల్లో పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందన్నారు. వికసిత్ భారత్ 2047 రోడ్‌మ్యాప్ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని, ఈ దిశగా తెలంగాణ రైజింగ్ సమ్మిట్ ఇన్వెస్టర్లను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. నెదర్లాండ్స్, భారత్ మధ్య బంధాలు విడదీయలేనివని అన్నారు. అ ప్రాంతంలో పారిశ్రామిక విప్లవాన్ని సృష్టిస్తున్న ఎఫ్‌సీసీఐ సభ్యుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఎఫ్‌సీసీఐ ద్వారా దేశ అభివృద్ధికి, దేశ రుణాన్ని తగ్గించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలు గర్వకారణమన్నారు దేశంలో కాలుష్యం, పర్యావరణ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణహిత ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ సంస్థ పర్యావరణ హితమైన బిల్డింగ్ మెటీరియల్, రూఫ్ సొల్యూషన్స్, సోలార్ రంగంలో అద్భుతాలు సృష్టిస్తోందని, సోలార్ టైల్స్ కు యూఎస్ పేటెంట్ లభించటం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఎఫ్‌సీసీఐ అధ్యక్షులు అడ్వకేట్ జస్బీర్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమోద్ అగర్వాల్ మెమెంటోతో సత్కరించారు. ఎఫ్‌సీసీఐ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమోద్ అగర్వాల్ మాట్లాడుతూ, ఎఫ్‌సీసీఐ ఏర్పాటు చేసి 45 సంవత్సరాలు పూర్తవుతుండగా, ఈ ఏడాదితో భారత్, నెదర్లాండ్స్ స్నేహానికి 75 ఏళ్లు పూర్తవుతున్నాయని తెలిపారు. భారత సంతతి వారిగా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతోనే ఈ కాన్ఫరెన్స్ నిర్వహించామని అన్నారు. పెట్టుబడుల పరంగా భారత్, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ప్రధాన గమ్యస్థానంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్యానెల్ డిస్కషన్‌లో పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడి విధానాలను వివరించారు. అలాగే పర్యావరణ హితంగా విశాఖ సంస్థ తీసుకువచ్చిన ఉత్పత్తులు అద్భుతమని ప్రశంసించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సముద్రాల సాయి కిరణ్ మాట్లాడుతూ, తెలంగాణ బిడ్డగా ఎఫ్‌సీసీఐలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని, నెదర్లాండ్స్‌లో పారిశ్రామికవేత్తగా కొనసాగుతున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా ఎదుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా భారత్, నెదర్లాండ్స్ మధ్య ఆర్థిక, పారిశ్రామిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## రైతు మనుగడ సంస్థ సీ ఈ ఓ గా రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన..



**ఇల్లందకుంట, డిసెంబర్ 19, (మనవార్త ప్రతినిధి):**రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో, రైతు మనుగడ కోసం పనిచేసే సంస్థకు. ధర్మారపు రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, ఆధునిక సాంకేతికత రైతులకు చేరువ చేయడం ప్రధాన లక్ష్యాలుగా పని చేస్తామని ఆయన తెలిపారు.రైతు ఆర్థిక స్థితి మెరుగుపడేలా, నాణ్యమైన విత్తనాలు, సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. రైతు బతుకే దేశ భవిష్యత్తు అని పేర్కొంటూ, రైతుల మనుగడ కోసం జజుూగా పూర్తి బాధ్యతతో పనిచేస్తానని స్పష్టం చేశారు.

## సర్పంచులను సన్మానించిన ముస్లిం సోదరులు..



**వీణవంక,డిసెంబర్ 19( మన వార్త ప్రతినిధి):** వీణవంక మజీద్ కమిటీ తరపుననిని నూతనంగా ఎన్నికైన సర్పంచును మరియు పాలకవర్గ సభ్యులను వీణవంక మజీద్ కమిటీ తరపున ముస్లిం కుల పెద్దలకు మరియు ముస్లిం సోదరులకు ఘనంగా సన్మానించారు.

## విపత్తు నిర్వహణ శాఖ వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చెయ్యాలి




**సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 19, ( మన వార్త ప్రతినిధి )**ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్టాలను నివారించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. నిశుక్రవారం, ప్రకృతి విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమ నిర్వహణ, వైపరీత్యాల నివారణ నిర్వహణ చర్యలపై సిఎస్ రామకృష్ణ రావు, జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ)హౌఅధికారులతో కలిసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ నెల 22 న విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ లను ఆదేశించారు. ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్కర సమయాల్లో ప్రాణ నష్టాలు నిర్వహించడంతో పాటు, ఆస్తి నష్టాలు తగ్గించగలుతామని చెప్పారు. పరిస్థితులను అంచనా వేయగలిగితే నష్టాలను తగ్గించగలుగుతామని వివరించారు. వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని అన్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని సాధనాలు వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వైపరీత్యాల సమయంలో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. దాదాపు 35 శాఖలు సమన్వయంతో మెలగాలని తెలిపారు. వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీరు విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి అంశాల రియల్ టైమ్ సమాచారం ప్రజలకు చేరవేయాలని చెప్పారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమగు అన్ని సేవల టోల్ ఫ్రీ నంబర్ల సమాచారం ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు మీ వద్ద ఉన్న డాటా ను శాఖకు అందించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా విపత్తు సంభవిస్తే వెంటనే స్పందించడానికి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. నిసమీకృత జిల్లా కార్యాలయ సముదాయం నుండి జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, అడిషనల్ డిసిపి సుభాష్ చంద్రబోస్, డిఆర్ఓ నాగరాజమ్మ, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, డిఎచ్ఓ సువర్ణ, డిసిఎస్ఓ తనూజ, డిఏఓ స్వరూపరాణి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణేష్ రామ్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ధర్మారెడ్డి, పశు సంవర్ధక శాఖ అధికారి కొండల్ రెడ్డి, డిఎంఅండ్ఎచ్ఓ ధనరాజ్, ఫైర్, ట్రాన్స్పోర్ట్, నీటిపారుదల, మున్సియల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## యాప్‌ల పేరుతో రైతులను ఆగం చేస్తున్న ప్రభుత్వం

**-బి.ఆర్.ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బుర్ర సూర్య గౌడ్...**

**ఇల్లంతకుంట, డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి):**ఇల్లంతకుంట మండలంలోని రైతులకు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ల కారణంగా రైతులందరినీ స్థానిక ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్నట్లు బి.ఆర్.ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బుర్ర సూర్య గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుర్ర సూర్య మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ అధికారులు సరైన యూరియా అందిస్తే,దుకాణాల వద్ద తెల్ల వారక ముందుకే వచ్చి క్యూ లైన్లు కడుతూ రైతులకు యూరియా సరిగా అందక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు. యూరియా సరిగా సరఫరా చేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు,ఈ యాప్ లో పేర్లతో రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. ప్రతి రైతుకు పెద్ద ఫోన్ ఉంటుందా..? అంతే కాదు,రైతులందరూ చదువుకున్నవారేనా..? ఏ విధంగా బుక్ చేసుకోవాలో,యాప్‌లో ఎలా నమోదు చేసుకోవాలో అవగాహన రైతులకు తక్కువే అని ఆయన ప్రశ్నించారు.రైతుల పరిస్థితి,వారి సమస్యలను తెలుసుకోకుండా యాప్,ఆన్లైన్ ఆధారిత విధానం అమలవ్వడం సరైనది కాదని ఆయన విమర్శించారు.రైతులు నాట్లు వేసుకునే సమయంలో పొలాల్లో ఉండాలా లేకపోతే వ్యవసాయ అధికారుల చుట్టూ యాప్ లు,ఆన్లైన్ల చుట్టూ అని తిరగాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులకు సంబంధించిన అధికారులు దృష్టి సారించి తక్షణమే ఇలాంటి కార్యక్రమాలను విరమించి,రైతులకు సరిపడే యూరియా అందించాలి అని డిమాండ్ చేశారు. అవసరమైతే,బి.ఆర్.ఎస్ పార్టీ తరపున రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు.



## రెండు ఇండ్లలో చోరీ..

**జమ్మికుంట, డిసెంబర్ 19( మన వార్త ప్రతినిధి):**మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి లో రెండు ఇండ్లలో చోరీ జరిగి బంగారం,నగదు పోయినట్లు బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రామకృష్ణ తెలిపారు. కొత్తపల్లి కి చెందిన కారుకుడి దేవేందర్ స్థానిక పంచాయితి ఎన్నికల కోసం తన కుటుంబ సభ్యులతో ఈనెల 11వ తేదిన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచూపేట అయిన సొంత గ్రామానికీ వెళ్ళాడు. 19 వ తేదీన తిరిగి వచ్చాడు ఇంటి తాళం తీసి లోపలికి వెళ్లేసరికి ఇంటి లోపల వస్తులు చిందరవందరగా ఉండి బీరువా తెరిచి ఉండగా అందులోనే తులం బంగారం, 10 తులాల పట్టీలు మరియు రూ 30 వేల నగదు కనిపించలేదని అదేవిధంగా తన ఇంటి ముందు ఇల్లు గల మాట్ల రవీందర్ ఇంటిలో కూడా దొంగతనం జరిగి 12 గ్రాముల బంగారు పుస్తెలతాడు రూ 9 వేల నగదు పోయినాయని నిర్ధారించుకొని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించి ఉంటారని బాధితుడు దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## రసవత్తరంగా మార్కెట్ వ్యాపార సంఘం ఎన్నికలు

**-తనదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్న మాజీ అధ్యక్షుడు...**

**-వ్యాపారులకు అండగా ఉంటా......**

**-మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు తమ్మిశెట్టి విజయ్ కుమార్...**

**మందమర్రి, డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి):**సార్వత్రిక ఎన్నికలు తలపించేలా పట్టణ మార్కెట్ కమిటీ ఎన్నికలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించనున్న మార్కెట్ కమిటీ ఎన్నికల్లో అధ్యక్ష బరిలో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు తమ్మిశెట్టి విజయ్ కుమార్, మాయ రమేష్ లు కలరు. గత ఆరు సంవత్సరాలుగా పట్టణ మార్కెట్ వ్యాపార సంఘం ఆద్వర్యంలో కార్యక్రమాలు చేపట్టగా, ఈ యేడు సుమారు 500 మంది వ్యాపారులు సంఘంలో సభ్యత్వం కలిగి ఉ ండి శనివారం జరగబోవు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించగా, అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి, విజేతలను ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో అధ్యక్ష బరిలో ఉన్న ఇరువురు అభ్యర్థులు ఈపాటికే విస్తృతంగా ప్రచారం నిర్వహించగా, ఎవరికి వారే గెలుపే ధీమా వ్యక్తం చేస్తున్నారు.నిరెండు పర్యాయాలు అధ్యక్షునిగా విజయ్ సేవలునివ్యాపార సంఘం గత ఆరు సంవత్సరాలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ సంఘం ఎన్నికలు రెండుసార్లు నిర్వహించగా, రెండుసార్లు తమ్మిశెట్టి విజయ్ అధ్యక్షునిగా గెలుపొంది, అధ్యక్షునిగా మార్కెట్ వ్యాపారులకు సేవలందించారు. మార్కెట్లోని పెద్ద, చిన్న వ్యాపారులతో సఖ్యతతో ఉండటంతో పాటు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ముందుండే వ్యక్తి తమ్మిశెట్టి విజయ్. దీంతో గత రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో వ్యాపారస్తులు విజయ్ కి పట్టం కట్టారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం మార్కెట్ వ్యాపారస్తులకు అండగా ఉండి, విజయ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి, ఆ సమయంలో వ్యాపారస్తులకు మనోధైర్యాన్ని కలిగించడంతోపాటు వారిలో ఒకడిగా వారికి అండదండగా ఉంటూ, వ్యాపారులకు చేయూతనందించారు. వ్యాపారుల కష్టసుఖాలలో వారికి తోడుగా ఉంటూ, అందరికీ కావలసిన వాడిగా విజయ్ మార్కెట్ వ్యాపారుల ప్రేమాభిమానాలు సంపాదించారు. మార్కెట్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సైతం కృషి చేస్తూ, సమస్యలను ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, మార్కెట్ ప్రాంతంలో పలు సమస్యలను పరిష్కరించడంలో తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా మార్కెట్లో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు సెంట్రల్ లైటింగ్ వంటి సదుపాయాలను కల్పించి, వ్యాపారుల ప్రశంసలు అందుకున్నారు. అదేవిధంగా మార్కెట్ ప్రాంతంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి, మార్కెట్లోని టిజిఆర్టీసీ ప్రాంగణంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభింపజేయడంలో విజయ్ ప్రముఖ పాత్ర పోషించారు. త్వరలోనే సులబ్ కాంప్లెక్స్ పట్టణ ప్రజలకు, వ్యాపారులకు అందుబాటులోకి రానున్నది. ఈ సందర్భంగా తమ్మిశెట్టి విజయ్ మాట్లాడుతూ, మార్కెట్ వ్యాపారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, మార్కెట్ అభివృద్ధికి పాటుపడడంతో పాటు మార్కెట్ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. శనివారం నిర్వహించనున్న మార్కెట్ కమిటీ ఎన్నికల్లో క్రమ సంఖ్య (2)లో తనకు ఓటు వేసి, మరల అధ్యక్షునిగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



## ఇల్లంతకుంట సర్పంచ్‌కు ముస్లిం సోదరులు ఘన సన్మానం..



**ఇల్లంతకుంట,డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి ):**ఇల్లంతకుంట మండల కేంద్రంలోని గ్రామంలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా విజయం సాధించిన "మామిడి రాజును" శుక్రవారం ఇల్లంతకుంట ముస్లిం మైనారిటీ సోదరులు శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ సోదరులు,పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధికి గ్రామపంచాయతీలే పునాది

**-గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలి...**

**-బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి...**



**మంచిర్యాల, డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి):**గ్రామ పంచాయతీలే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని, ప్రజలకు ఇచ్చిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సర్పంచ్ లకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సూచించారు. శుక్రవారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో గెలుపొందిన సర్పంచులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాసీపేట మండలానికి చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యానికి, గ్రామ స్వయంపాలనకు పెద్దపీట వేస్తుందని, ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో గ్రామ పంచాయతీల బలోపేతానికి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాలను సర్వతోముఖాభివృద్ధి సాధించాల్సిన బాధ్యత సర్పంచులదేనని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలతో గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. పార్టీ, ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బన్న లక్ష్మణ్ దాస్, రాపర్తి శ్రీనివాస్, విక్రమ్ రావ్, ఉత్తురి సత్తయ్య, నస్పూరి నర్సింగం, రౌతు సత్తయ్య, దారవేణి రాజయ్య, రోషవేని బాపు, గోలేటి స్వామి, రమేష్, బుక్య రాంచందర్, పుర్ర కుమారస్వామి, బుక్య రవి, దుస్స చందు, శిలార్ ఖాన్, భీమ్ నాయక్, ఆత్రం జంగు, సర్పంచులు బాదావత్ నీల, చాకటి సుగుణ, దుస్స విజయ, భూక్య స్వప్న, భూక్య చైతన్య, బానోతు రాణి, నవనందుల పుష్పలత, మాడవి వెంకటేష్, పంద్రం శంకర్, ఆడే దివ్య, ఉపసర్పంచ్ లు రమేష్, సూరం కిషన్, ఆల్క రాజు, మెంద్రపు రాజయ్య, శారద, మల్లెతుల సందీప్, మద్దెవేని వేణు, పానుగంటి అశోక్, నగేష్, నామసాని రాజు, మారం లచ్చన్న, బలరాం, స్వామి, షారుక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్పంచ్ సుజాత మల్లేశం గౌడ్ ను సన్మానించిన జామియా మస్జిద్ కమిటీ మైనారిటీ సోదరులు సన్మానం




**నార్సింగి డిసెంబర్ 19 ( మన వార్త ప్రతినిధి)** ఇటీవల జరిగిన రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో నార్సింగి సర్పంచ్ గా భారీ మెజారిటీ తో ఎన్నికైన ఆకుల సుజాత మల్లేశం గౌడ్ ను శుక్రవారం స్థానిక జామియా మస్జీద్ కమిటీ అధ్యక్షుడు చాంద్ పాషా ఖురేషి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మల్లేశం గౌడ్ మాట్లాడుతూ నార్సింగి గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేస్తూ కుల మతాలకు అతీతంగా అందర్నీ కలుపుకుని గ్రామ అభివృద్ధిలో ముందుంజ లో ఉంచుతానని, గ్రామ అభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మస్జిద్ కమిటీ కోశాధికారి యూసుఫ్, అకౌంటెంట్ సలీం షేక్, ఎస్ ఎం సీ మాజీ చైర్మన్ బాఖర్ పాషా, మాజీ వార్డు సభ్యుడు జమీర్, మైనారిటీ నాయకులు గుల్ఫోజ్, జహీర్, ముజీబ్, ఇమ్రాన్, మహబూబ్, గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు

## భద్రాచలంలో అవుట్డోర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



**భద్రాచలం, డిసెంబర్ 19:(మన వార్త ప్రతినిధి).**ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియం ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన అవుట్డోర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల కోసం ప్రత్యేక టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను ఈనెల 23, 24వ తేదీలలో రాత్రి 7 గంటలకు ఐటీడీఏ ట్రైబల్ మ్యూజియం ప్రాంగణంలో ప్రారంభించి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. క్రీడాకారులు పాల్గొనాలనుకుంటే రూ.500 ఎంట్రీ ఫీజును చెల్లించి పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎంట్రీ ఫీజు చెల్లించిన వారు తమ పేరుతో పాటు పాల్గొనే భాగస్థుని పేరు ఇవ్వాలని, ముందుగా పేర్కొన్న వారు మ్యాచ్‌లలో ఆడతారని ఆయన చెప్పారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులుగా మొదటి బహుమతి రూ.8,000, రెండవ రూ.6,000, మూడవ రూ.4,000, నాలుగవ రూ.2,000 చొప్పున అందజేయబడుతుందని ఆయన తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో అవుట్డోర్ క్రీడాకారులకే అవకాశం ఉందని, ఇండోర్ క్రీడాకారులు పాల్గొనరాదని స్పష్టం చేశారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ ఎంట్రీ ఫీజును ఈనెల 22వ తేదీ రాత్రి 10 గంటలలోపు ఫోన్‌పే ద్వారా 9948839775, 9676391061 నంబర్లకు పంపించి పేర్లు నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఇతర వివరాల కోసం పై నంబర్లను సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

## అనంతారం సర్పంచ్‌కు ముస్లిం మైనారిటీ సోదరుల సన్మానం..




**ఇల్లంతకుంట,డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి):**ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా విజయం సాధించిన వొల్లాల రజిత వెంకటేశంను శుక్రవారం అనంతారం దర్గాలో,ఇల్లంతకుంట ముస్లిం మైనారిటీ సోదరులు శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాద్,సద్దాం,అజీమ్,సాయిద్,నయిముద్దీన్,అసిఫ్,కాజా,అశ్విక్,తాజు,ఆరీష్,ముబీన్, భాజా,ఫహీం,ఖలీల్, ఫర్వేజ్,సుమేరా,సమీర్, అజ్మత్,సలీమ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కోఆప్షన్ సభ్యులుగా దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలి

**-విహెచ్పిఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ...**

**మందమర్రి, డిసెంబర్ 19 (మన వార్త ప్రతినిధి):**స్థానిక సంస్థలలో గ్రామపంచాయతీ కోఆప్షన్ సభ్యులుగా దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్పిఎస్) జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ కోరారు. మండలంలోని పులిమడుగు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విహెచ్పిఎస్ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ప్రతి గ్రామంలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, చేయుత పెన్షన్ దారులు ఉన్నందున పంచాయతీ పరిధిలో వారి సేవలు కొనసాగించడం కొరకు పంచాయతీ పాలనలో వికలాంగులకు సైతం భాగస్వామ్యం చేసి, పంచాయతీ కోఆప్షన్ సభ్యులుగా అవకాశం ఇవ్వాలని ఎన్నిక కాబడిన సర్పంచ్లను, ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ మండల అధ్యక్షుడు ఇందూరి రమేష్, నాయకులు బానోతు రాజు, బొద్దుల బుచ్చి రాజం, ధరావత్ రాందాసు, దురిశెట్టి లక్ష్మణ్ లు పాల్గొన్నారు.



# ఎయిర్‌పోర్టులపై రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు..



**హైదరాబాద్** గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ రాబోయే 5 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల అభివృద్ధిపై సుమారు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. దేశంలో విమానయాన రంగం ప్రతి ఏడాది 15 నుంచి 16 శాతం వృద్ధి నమోదు చేయనుందన్న అంచనాల నేపథ్యంలో ఈ భారీ పెట్టుబడుల ప్రణాళికను రూపొందించినట్లు గ్రూప్ వెల్లడించింది.నిఈ విషయాన్ని అదానీ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్ జీత్ అదానీ వెల్లడించారు. ప్రయాణికుల రాకపోకలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. విమానాశ్రయాల్లో టెర్మినల్స్ విస్తరణ, రన్‌వేలు, కార్గో హబ్‌లు, లాజిస్టిక్స్ సదుపాయాల అభివృద్ధిపై ఈ పెట్టుబడులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.నిఈ నెల 25న నవీ ముంబై విమానాశ్రయంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు అదానీ గ్రూప్ ప్రకటించింది. ఈ విమానాశ్రయం గ్రూప్ విస్తరిస్తున్న ఎయిర్‌పోర్టుల పోర్ట్‌ఫోలియోలో కీలకంగా నిలవనుంది. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సంస్థ ద్వారా అభివృద్ధి చేసిన ఈ ప్రాజెక్టులో అదానీ గ్రూప్‌కు 74 శాతం వాటా ఉంది.నిప్రాథమిక దశలో ఈ విమానాశ్రయాన్ని సుమారు రూ.19,650 కోట్ల వ్యయంతో నిర్మించారు. మొదటి దశలో ఏడాదికి 2 కోట్ల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యం ఉండగా, భవిష్యత్‌లో దీన్ని విస్తరించి ఏడాదికి 9 కోట్ల మంది ప్రయాణికులను సేవలందించే స్థాయికి తీసుకెళ్లే ప్రణాళికలు ఉన్నాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా విమాన ప్రయాణాలు పెరుగుతున్న నేపథ్యంలో అదానీ గ్రూప్ తీసుకున్న ఈ నిర్ణయం విమానయాన రంగానికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# కేవలం రూ.1748తో 336 రోజుల వ్యాలిడిటీ..




**హైదరాబాద్** తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం మొబైల్ సేవలు వినియోగించాలనుకునే వారికి రిలయన్స్ జియో ఒక ఆకర్షణీయమైన రీఛార్జ్ ప్లాన్‌ను అందుబాటులో ఉంచింది. కేవలం రూ.1748 చెల్లిస్తే ఏకంగా 336 రోజుల వ్యాలిడిటీ లభించే ఈ ప్లాన్ ప్రస్తుతం వినియోగదారుల్లో మంచి ఆదరణ పొందుతోంది.నిఈ ప్లాన్ ముఖ్యంగా డేటా అవసరం తక్కువగా ఉండే వారికి అనుకూలంగా రూపొందించారు. ఇంట్లో వైఫై సౌకర్యం ఉన్నవారు, లేదా ప్రధానంగా కాలింగ్ అవసరాలకే మొబైల్ ఉపయోగించే వారు ఈ ప్లాన్‌ను ఎంచుకుంటున్నారు. ఈ రీఛార్జ్‌తో అపరిమిత వాయిస్ కాలింగ్ సదుపాయం లభించడంతో పాటు మొత్తం 3600 ఎస్ఎంఎస్‌లు కూడా అందుబాటులో ఉంటాయి.నిఅయితే ఈ ప్లాన్‌లో మొబైల్ డేటా ఇవ్వడం లేదు. అవసరమైతే వినియోగదారులు అదనంగా డేటా ప్యాక్‌ను కొనుగోలు చేసుకోవచ్చు. దీర్ఘకాల వ్యాలిడిటీ కావాలనుకునే వారికి ఇది తక్కువ ఖర్చుతో మంచి ఎంపికగా మారింది. తల్లిదండ్రులు, వృద్ధులు వంటి వారి కోసం ఈ ప్లాన్‌ను ఎక్కువగా తీసుకుంటున్నట్లు టెలికాం వర్గాలు చెబుతున్నాయి.నిఇక అదనపు ప్రయోజనాల విషయానికి వస్తే, ఈ రీఛార్జ్‌తో జియో టీవీ, జియో క్లౌడ్ వంటి సేవలకు ఉచిత యాక్సెస్ లభిస్తుంది. దీర్ఘకాలం రీఛార్జ్ చేయాల్సిన అవసరం లేకుండా ఒకేసారి చెల్లించి, ఏడాదికి సమీప కాలం సేవలు పొందడం ఈ ప్లాన్ ప్రత్యేకతగా చెప్పవచ్చు.నిమొత్తంగా చూస్తే, తక్కువ ధర, ఎక్కువ వ్యాలిడిటీ, అపరిమిత కాలింగ్ వంటి ప్రయోజనాలతో రూ.1748 జియో ప్లాన్ కాలింగ్ అవసరాలకే మొబైల్ వినియోగించే వారికి బెస్ట్ ఆప్షన్‌గా నిలుస్తోంది.

# గుండెపోటుతో గర్భిణి మృతి

## శవాన్ని ఊళ్లోకి రానివ్వని గ్రామస్తులు




**భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 19(మనవార్త ప్రతినిధి):** భద్రాద్రి జిల్లా గుండాల మండలంలో లలిత తొమ్మిది నెలల గర్భిణి. బుధవారం ఉదయం కడుపులో నొప్పి వస్తుందని చెప్పడంతో ఆమెను స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు లలితను పరీక్షించి ఇల్లందుకు రెఫర్ చేయగా.. అక్కడి నుంచి ఖమ్మం సర్కార్ హాస్పిటల్‌కు పంపించారు. అక్కడ లలితను పరీక్షించిన డాక్టర్లు రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించి ట్రీట్‌మెంట్‌కు సిద్ధం అవుతుండగానే...లలిత ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. పరీక్షించిన డాక్టర్లు లలిత చనిపోయినట్లు నిర్ధారించారు. దీంతో అంత్యక్రియల కోసం లలిత డెడ్‌బాడీని లింగగూడెం గ్రామానికి తీసుకొస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ లీడర్ జాడి ప్రభాకర్‌తో పాటు మరికొందరు గ్రామస్తులు లలిత కుటుంబ సభ్యులను గ్రామ శివారులోనే అడ్డుకున్నారు. గర్భిణి అయిన లలిత డెడ్‌బాడీని గ్రామంలోకి తీసుకొచ్చి అంత్యక్రియలు చేస్తే గ్రామానికి కీడు జరుగుతుందంటూ, ఎక్కడో చనిపోయిన తర్వాత గ్రామానికి తీసుకురావడం ఏంటని ప్రశ్నించారు.డెడ్‌బాడీని గ్రామంలోకి తీసుకురావద్దని చెప్పడంతో గ్రామ శివారులోనే టెంట్ వేసి డెడ్‌బాడీని అక్కడే ఉంచారు. తర్వాత మల్లన్న వాగు బ్రిడ్జి సమీపంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా, డెడ్‌బాడీని గ్రామంలోకి తీసుకురాకుండా అడ్డుకున్న ప్రభాకర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

# ఆపిల్ మాక్‌బుక్ ఎయిర్ ఎం4పై 18000 తగ్గింపు..



**హైదరాబాద్** ల్యాప్‌టాప్ కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి ఆపిల్ సంస్థ శుభవార్త చెప్పింది. శక్తివంతమైన ఎం4 ప్రాసెసర్‌తో వచ్చిన మాక్‌బుక్ ఎయిర్‌పై ఈ ఏడాది ముగింపులో భారీ తగ్గింపు అందుబాటులోకి వచ్చింది. మొత్తం మీద 18000 వరకు ధర తగ్గడంతో టెక్నాలజీ అభిమానుల దృష్టి ఈ ఆఫర్‌పై నిలిచింది.నిప్రస్తుతం విజయ్ సేల్స్ స్టోర్లలో మాక్‌బుక్ ఎయిర్ ఎం4, 16 జీబీ ర్యామ్ మరియు 256 జీబీ స్టోరేజ్ వేరియంట్ 91900 ధరకు లభిస్తోంది. కంపెనీ ప్రారంభ ధర 99900 కాగా, దీనిపై నేరుగా 8000 తగ్గింపు వర్తిస్తోంది. దీనికి తోడు ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేస్తే అదనంగా 10000 బ్యాంక్ ఆఫర్ తగ్గింపు పొందే అవకాశం ఉంది. ఈ విధంగా మొత్తం 18000 వరకు ఆదా చేసుకోవచ్చు. ఈ ఆఫర్ 13.6 అంగుళాల డిస్‌ప్లే మోడల్‌కు మాత్రమే వర్తిస్తుంది.నిఈ మాక్‌బుక్ ఎయిర్ ఎం4 రెండు స్క్రీన్ పరిమాణాల్లో అందుబాటులో ఉంది. 13.6 అంగుళాలు మరియు 15.3 అంగుళాల ఎంపికలు ఉన్నాయి. గరిష్టంగా 500 నిట్స్ వెలుగు తీవ్రతతో డిస్‌ప్లే వస్తుండగా, క్వాడ్ స్పీకర్ ఆడియో వ్యవస్థతో వినోద అనుభవాన్ని మెరుగుపరుస్తుంది. తేలికైన డిజైన్‌తో పాటు రోజువారీ పనులు, ఆఫీస్ వర్క్, తేలికపాటి ఎడిటింగ్ అవసరాలకు ఇది అనువైన యంత్రంగా నిలుస్తోంది.నిపాత ఇంటెల్ ప్రాసెసర్ మోడళ్ల నుంచి లేదా ఎం1 మాక్‌బుక్ ఎయిర్ నుంచి అప్‌గ్రేడ్ కావాలనుకునేవారికి ఈ ఎం4 మోడల్ మంచి ఎంపికగా భావిస్తున్నారు. మెరుగైన ఉష్ణ నియంత్రణ, దీర్ఘకాలిక బ్యాటరీ సామర్థ్యం, స్మూత్ పనితీరుతో ఈ ల్యాప్‌టాప్ వినియోగదారులను ఆకట్టుకుంటోంది. భారీ ధర తగ్గింపుతో లభిస్తున్న ఈ ఆఫర్, 2025 చివర్లో ల్యాప్‌టాప్ కొనుగోలు చేసే వారికి నిజంగా బంపర్ అవకాశంగా మారింది.

# బంగారం ధరలు మళ్లీ ఎగిసాయి వెండిలోనూ ఊహించని పెరుగుదల!



**హైదరాబాద్** దేశీయంగా, అంతర్జాతీయంగా పసిడికి డిమాండ్ మరింత పెరగడంతో బంగారం ధరలు మరోసారి ఎగబాకాయి. డిసెంబర్ 19 ఉదయం ఢిల్లీ మార్కెట్‌లో 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు రూ.1,34,670కి చేరింది. 22 క్యారెట్ బంగారం ధర రూ.1,23,460 వద్ద కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా ధరలు పెరుగుతూనే ఉండటంతో పెట్టుబడిదారుల్లో ఆసక్తి మరింత పెరిగింది.నిఅమెరికా డాలర్ ఇండెక్స్ రెండు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోవడం బంగారం ధరలకు ప్రధాన కారణంగా మారింది. డాలర్ బలహీనపడటంతో అంతర్జాతీయ కొనుగోలుదారులకు బంగారం మరింత చౌకగా లభిస్తోంది. దీంతో ప్రపంచ మార్కెట్లలో పసిడి ధరలు రికార్డు స్థాయికి సమీపంలో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు 4,321.06 డాలర్ల వద్ద కొనసాగుతోంది. జియోపాలిటికల్ అనిశ్చితులు, భద్రమైన పెట్టుబడులపై పెరిగిన ఆసక్తి, కేంద్ర బ్యాంకుల విధానాలు కూడా బంగారం ధరలను పైకి నెట్టుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.నిదేశంలోని ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు దాదాపు ఒకే స్థాయిలో ఉన్నాయి. హైదరాబాద్, ముంబై, చెన్నై, కోల్‌కతా వంటి నగరాల్లో 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు సుమారు రూ.1,34,520 నుంచి రూ.1,34,670 మధ్య ట్రేడవుతోంది. 22 క్యారెట్ బంగారం ధరలు కూడా రూ.1,23,300 నుంచి రూ.1,23,460 పరిధిలో కొనసాగుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో ధరలు ఇంకా పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.నిబంగారంతో పాటు వెండి ధరలు కూడా ఊహించని రీతిలో దూసుకుపోతున్నాయి. గురువారం ఉదయం దేశీయ మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,08,100కి చేరింది. అంతర్జాతీయంగా వెండి స్పాట్ ధర ఔన్స్‌కు 66.52 డాలర్లతో సరికొత్త రికార్డును నమోదు చేసింది. సరఫరా లోపం, సిల్వర్ ఈటీఎఫ్‌లలో పెరిగిన పెట్టుబడులు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతపై అంచనాలు వెండి ధరలకు మరింత బలాన్ని ఇస్తున్నాయి.నిఅంతేకాదు, 2026 నుంచి చైనా వెండి ఎగుమతులపై ఆంక్షలు విధించే అవకాశం ఉందన్న వార్తలు కూడా మార్కెట్‌ను ఉత్సాహపరిచాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు వెండి ధరలు ఏకంగా 127 శాతం పెరగడం గమనార్హం. భవిష్యత్తులో పారిశ్రామిక అవసరాలు పెరగడం, గ్రీన్ ఎనర్జీ రంగంలో వెండి వినియోగం అధికమవడం వల్ల వెండి ధరలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.నిమొత్తానికి బంగారం, వెండి రెండింటిలోనూ ధరల జోరు కొనసాగుతుండటంతో పెట్టుబడిదారులు, సాధారణ వినియోగదారులు మార్కెట్‌ను జాగ్రత్తగా గమనించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# రాజా సాబ్ హంగామా ముందురోజే..



**హైదరాబాద్** టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా, మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న భారీ హారర్ థ్రిల్లర్ 'ది రాజా సాబ్'పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. సంక్రాంతి బరిలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా విడుదలకు ముందే అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. సినిమా రిలీజ్‌కు ఒకరోజు ముందే ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు.నిప్రపంచవ్యాప్తంగా జనవరి 9, 2026న గ్రాండ్‌గా విడుదల కానున్న 'రాజా సాబ్', అభిమానుల కోరిక మేరకు జనవరి 8, 2026న తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రధాన నగరాల్లో స్పెషల్ ప్రీమియర్స్‌తో సందడి చేయనుంది. దీంతో ప్రభాస్ వింటేజ్ లుక్‌ను అభిమానులు ముందుగానే థియేటర్లలో ఆస్వాదించనున్నారు. ఈ నిర్ణయంతో విడుదలకు ముందే థియేటర్ల వద్ద పండగ వాతావరణం నెలకొనే అవకాశం కనిపిస్తోంది.నిఇక ప్రచార కార్యక్రమాలను మరింత భారీగా నిర్వహించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. హైదరాబాద్‌లోని ఓ విశాలమైన ఓపెన్ గ్రౌండ్‌లో అతి వైభవంగా 'ది రాజా సాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ వేడుకకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.నిఇప్పటికే ప్రమోషన్లలో భాగంగా విడుదలైన 'సహనా సహనా' పాట సోషల్ మీడియాలో భారీ హిట్‌గా నిలిచింది. తమన్ అందించిన స్వరాలు, ప్రభాస్ స్టైలిష్ లుక్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పాటతో సినిమాపై అంచనాలు మరింత పెరగడంతో, 'రాజా సాబ్' విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విజయ్ వారసుడి డైరెక్షన్‌లో 'సిగ్మా' షూటింగ్ కంప్లీట్




**చెన్నై** కోలీవుడ్ 'దళపతి' విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న తొలి చిత్రం 'సిగ్మా' షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ అన్ని షెడ్యూల్స్‌ను పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి అడుగుపెట్టిందని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా షూటింగ్ కంప్లీషన్ వీడియోను విడుదల చేయగా, అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.నిఇదే సమయంలో 'సిగ్మా' టీజర్ విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. డిసెంబర్ 23న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. జేసన్ సంజయ్ దర్శకత్వంలో రూపొందిన తొలి చిత్రమే కావడంతో పాటు, సందీప్ కిషన్ కెరీర్‌లోనే భారీ ప్రాజెక్ట్‌గా ఇది నిలవనుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. యాక్షన్ ప్యాక్డ్ కమర్షియల్ కథతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై విజయ్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.నిప్రఖ్యాత నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. నేషనల్ అవార్డు గ్రహీత ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. లండన్, కెనడాల్లో ఫిల్మ్ మేకింగ్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన జేసన్ సంజయ్, హీరోగా కాకుండా దర్శకుడిగా తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. 'సిగ్మా' విడుదల తేదీని త్వరలోనే ప్రకటించే అవకాశముందని చిత్ర వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# టీ20 ప్రపంచకప్, న్యూజిలాండ్ సిరీస్‌కు జట్ల ప్రకటన..



**హైదరాబాద్** కొత్త ఏడాదిలో భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించనున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్‌తో పాటు, స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు భారత జట్ల ఎంపికపై బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకోబోతోంది. ఈ రెండు ప్రధాన టోర్నీల కోసం జట్లను ఎంపిక చేసేందుకు సెలక్షన్ కమిటీ డిసెంబర్ 20న ముంబయిలో సమావేశం కానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.నిఈ సమావేశంలో ముందుగా న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు జట్టును ఎంపిక చేయనున్నారు. అదే జట్టును స్వల్ప మార్పులతో టీ20 ప్రపంచకప్‌లో కొనసాగించే అవకాశం ఉందని సమాచారం. సెలెక్టర్లు పెద్ద ఎత్తున మార్పులకు వెళ్లే అవకాశాలు తక్కువగానే ఉన్నాయని బీసీసీఐ వర్గాలు సూచిస్తున్నాయి. ప్రపంచకప్‌కు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఐసీసీకి సమర్పించాల్సి ఉండగా, గాయాలు లేదా ఫామ్ సమస్యలుంటే టోర్నీ ఆరంభానికి ముందు మార్పులు చేసుకునే వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు.నిభారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జనవరి 11 నుంచి 31 వరకు మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. అనంతరం ఫిబ్రవరిలో టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానుంది. భారత జట్టు ఫిబ్రవరి 7న ముంబయిలో యూఎస్ఏతో తొలి మ్యాచ్ ఆడనుంది. ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాతో, ఫిబ్రవరి 15న కొలంబోలో పాకిస్తాన్‌తో, ఫిబ్రవరి 18న అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో గ్రూప్ దశ మ్యాచ్‌లు ఉన్నాయి.నిఇదిలా ఉండగా జట్టులో కొన్ని కీలక స్థానాలపై చర్చ కొనసాగుతోంది. టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌పై విమర్శలు ఉన్నప్పటికీ, నాయకత్వంపై సెలెక్టర్లు నమ్మకం ఉంచే అవకాశం ఉందని సమాచారం. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్థానం మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. టీ20 ఫార్మాట్‌లో స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోవడంతో అతనికి గట్టి పోటీ ఎదురవుతోంది. సంజు శాంసన్‌తో పాటు యువ ఆటగాళ్లు పోటీలో ఉండగా, ఫామ్ మెరుగుపడకపోతే యశ్వసి జైస్వాల్‌కు అవకాశం దక్కే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.నిఈ నేపథ్యంలో డిసెంబర్ 20న జరగనున్న సెలక్షన్ కమిటీ సమావేశం టీమిండియా భవిష్యత్తును నిర్ధారించే కీలక మలుపుగా మారనుంది.

# భారత్ - దక్షిణాఫ్రికా ఐదో టీ20

## ఉత్కంఠభరితంలో గెలిచిన భారత్




భారత్ – దక్షిణాఫ్రికా మధ్య జరిగిన ఐదో టీ20 ఉత్కంఠభరితంగా సాగింది. టీమిండియా అందించిన 232 పరుగుల భారీ టార్గెట్ ఛేజింగ్‌తో బరిలోకి దిగిన సౌతాఫ్రికా ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది.తొలి ఓవర్‌లోనే హ్యాట్రిక్ ఫోర్లతో శుభారంభం చేసిన క్వింటన్ డికాక్.. పవర్ ప్లేలో భారత బౌలర్లను ఉతికారేశాడు. పేస్, స్పిన్ అన్న తేడా లేకుండా బౌండరీలు బాది మ్యాచ్‌పై పట్టు సాధించాడు. తొలి పది ఓవర్లలో సఫారీల ఆట చూసి మ్యాచ్ వన్ సైడ్ అని అందరూ ఫిక్సయ్యారు. పది ఓవర్ల తర్వాత మ్యాచ్ మొత్తం ఒక్కసారిగా మలుపు తిరిగింది. 11వ ఓవర్‌లో బంతి అందుకున్న జస్ప్రీత్ బుమ్రా అద్భుతమైన బంతితో హాఫ్ సెంచరీ బాదిన డికాక్‌ను కాట్ అండ్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత ఓవర్‌లోనే బ్రెవిస్‌ను పాండ్యా బయటకు పంపగా.. 13వ ఓవర్ వరుస బంతుల్లో కెప్టెన్ మర్కరమ్, ఫెరీరాను వరుణ్ చక్రవర్తి పెవిలియన్‌కు పంపాడు. వరుసగా మూడు ఓవర్లలోనే సౌతాఫ్రికా నాలుగు వికెట్లు కోల్పోయింది.పది ఓవర్లకు 118/1తో ఉన్న సౌతాఫ్రికా జట్టు కేవలం 17 పరుగుల తేడాతోనే కీలకమైన నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కొంతసేపు డేవిడ్ మిల్లర్ స్కోర్ బోర్డును ముందుకు నడిపించే ప్రయత్నం చేసినా అర్ష్‌దీప్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి సంజుకి క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. దాంతో సౌతాఫ్రికా 154 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది.టెయిలెండర్ బ్యాటర్లు కాసేపు పోరాడినా ఫలితం దక్కలేదు. నిర్ణీత 20 ఓవర్లు ముగిసే సమయానికి సౌతాఫ్రికా జట్టు 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. దాంతో టీమిండియా 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. క్వింటన్ డికాక్ 65 (35), రీజా హెండ్రిక్స్ 13 (12), డివాల్డ్ బ్రెవిస్ 31 (17), డేవిడ్ మిల్లర్ 18 (14), ఎయిడెన్ మర్కరమ్ 6 (4), డొనోవాన్ ఫెరీరా 0 (1), జార్జ్ లిండే 16 (8), మార్కో యాన్సన్ 14 (5), కార్బిన్ బాష్ 17 (15), లుంగీ ఎంగిడి 7 (9) పరుగులు చేశారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 4 వికెట్లు పడగొట్టాడు. బుమ్రా రెండు, పాండ్యా ఒకటి, అర్ష్‌దీప్ ఒక వికెట్ తీసుకున్నారు. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో టీమిండియా 3 – 1 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది.అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. సంజు శాంసన్ 37 (22), అభిషేక్ శర్మ 34 (21), తిలక్ వర్మ 73 (42), సూర్యకుమార్ యాదవ్ 5 (7), హార్దిక్ పాండ్యా 63 (25), శివమ్ దుబే 10 (3) పరుగులు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో కార్బిన్ బాష్ రెండు వికెట్లు పడగొట్టగా.. జార్జ్ లిండే, బార్ట్‌మన్ చెరొక వికెట్ తీసుకున్నారు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com